హామీల అమలెప్పుడు..?



కొవ్వూరు పట్టణంలో అసంపూర్తిగా నిలిచిపోయిన టిడ్కో గృహాలు

- నిడదవోలు, కొవ్వూరుల్లో అసంపూర్తిగా టిడ్కో ఇళ్లు
- వంద పడకల ఆసుపత్రుల ఏర్పాటు హామీదీ అదే తీరు
- రెండు నెలలైనా పంట నష్టపరిహారం ఊసేలేదు
- వంద రోజుల కూటమి పాలనపై పెదవి విరుస్తున్న ప్రజలు

కొవ్వూరు: రాష్ట్రంలో అధికారంలోకి రావడానికి కూటమి నేతలు సార్వత్రిక ఎన్నికల వేళ ఎన్నో హామీలు గుప్పించారు. అధికారంలోకి వచ్చి, వంద రోజులు గడిచినప్పటికీ ఆ హామీల అమలు ఊసే మరిచారు. కనీసం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంపై కూటమి ప్రజా ప్రతినిధులు దృష్టి సారించక పోవడం విమర్శలకు తావిస్తోంది. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే నిడదవోలు నియోజకవర్గంలో రోడ్ల రూపు రేఖలే మార్చేస్తామన్నారు. నిడదవోలు పట్టణంలో ఆటోనగర్ నిర్మిస్తామన్నారు. ఊరూవాడా ఊకదంపుడు ప్రసంగాలు ఇచ్చారు. హామీ ఇచ్చిన కూటమి నేత ఏకంగా రాష్ట్ర మంత్రి అయ్యారు. అయినప్పటికీ ఇంత వరకూ హామీల అమలు ప్రస్తావనే లేదు. కొవ్వూరు రైల్వే స్టేషన్‌లో ఆగే ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టలను కోవిడ్ సమయంలో నిలిపివేసిన విషయం తెలిసిందే. వాటిని పునరుద్ధరించేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కావడానికి ముందు ముప్పిడి వెంకటేశ్వరరావు పలుమార్లు ప్రకటించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి రాష్ట్ర అధ్యక్షురాలైన రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి కనీసం ఈ సమస్యపై నోరు మెదపడం లేదు. రైల్వే స్టేషన్ పరిరక్షణ సమితి పేరుతో కొవ్వూరులో ఎంతోమంది విద్యావంతులు, మేధావులు రైళ్ల హాల్టుల కోసం పెద్ద ఉద్యమమే సాగిస్తున్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో భాగస్వామి అయిన బీజేపీ ఎంపీ ఈ రైళ్ల హాల్టులపై దృష్టి సారించక పోవడం విమర్శలకు తావిస్తోంది. ఎర్ర కాలువపై కంసాలిపాలెం–మాధవరం గ్రామాల మధ్య వంతెన నిర్మాణం చేపడతామన్న హామీ ఊసే లేదు. ఏటా వరదల సమయంలో ఈ మార్గంలో రాకపోకలకు ప్రజలు, వాహన చోదకులు పడరాని పాట్లు పడుతున్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు నిడదవోలులో స్పోర్ట్స్ కాంప్లెక్స్, ఇండోర్ స్టేడియం నిర్మిస్తామని ఇచ్చిన హామీ సైతం కార్యరూపం దాల్చలేదు. క్రీడాకారుల ఆశలపై కూటమి సర్కారు నీళ్లు చల్లింది.



నిడదవోలు మండలం కంసాలిపాలెం-మాధవరం గ్రామాల మధ్య ఎర్ర కాలువపై వంతెన నిర్మించాల్సిన ప్రదేశం

టిడ్కో గృహాల ప్రారంభం ఎప్పుడో...?

ప్రధానంగా తాము అధికారంలోకి రాగానే కొవ్వూరు, నిడదవోలు పురపాలక సంఘాల పరిధిలో టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అప్పగిస్తామంటూ కూటమి నేతలు హామీ ఇచ్చారు. కూటమి కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఎక్కడ ఎన్నికల సభలో పాల్గొన్నా ఇదే అంశాన్ని ప్రస్తావించేవారు. నిడదవోలులోనూ ఇదే పరిస్థితి. ఇంతవరకూ అసంపూర్తిగా ఉన్న టిడ్కో గృహాల నిర్మాణాలు పూర్తి కానేలేదు. కనీసం టిడ్కో ఇళ్లకు మౌలిక సదుపాయాల కల్పన పూర్తి కాలేదు. దీంతో రెండు పట్టణాల్లోనూ టిడ్కో గృహ సముదాయాలు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ ప్రాతినిధ్యం వహిస్తున్న నిడదవోలు నియోజకవర్గంలోనూ టిడ్కో లబ్ధిదారుల కల నేరవేరడం లేదు.

వంద పడకలేనా..?

నిడదవోలు, కొవ్వూరు ప్రభుత్వ సామాజిక ఆసుపత్రులను వంద పడకల ఆసుపత్రులుగా మార్చాలనేది రెండు ప్రాంతాల ప్రజల చిరకాల కోరిక. ఏప్రిల్ 10న నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో బీజేపీ ఎంపీ పురందేశ్వరి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌లు నిడదవోలు ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా స్థాయి పెంచుతామని హామీ ఇచ్చారు. నిడదవోలులో వంద పడకల ఆసుపత్రి నిర్మాణ పనులు గతంలోనే అసంపూర్తిగా నిలిచిపోయాయి. గత ప్రభుత్వ హయాంలోనే కొవ్వూరు పట్టణంలో రూ.5 కోట్లు వెచ్చించి వందల పడకల ఆసుపత్రికి అవసరమైన భవనాల నిర్మాణం పూర్తి చేశారు. ప్రభుత్వం చొరవ చూపక పోవడంతో మెరుగైన చికిత్స కోసం ఈ ప్రాంత వాసులు రాజమహేంద్రవరం వెళ్లాల్సిన పరిస్థితి ఉంది.



వంద పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేస్తామన్న నిడదవోలులోని ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి భవనం

పంట నష్టపరిహారం ఏదీ..?



ఎర్ర కాలువ వరదకు ముంపుబారిన పడిన నిడదవోలు మండలం తాళ్లపాలెం సమీపంలో పంట పొలాలు

ఈ ఏడాది జూలైలో కురిసిన భారీ వర్షాలు, గోదావరి వరదల కారణంగా కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం నియోజకవర్గాల్లో అన్నదాతలకు అపార నష్టం సంభవించింది. ఒక్కో రైతు ఎకరానికి సుమారు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకూ పెట్టుబడులు పెట్టి మొత్తం నష్టపోయారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఏ నెలలో పంట నష్టం సంభవిస్తే అదే నెలలో పరిహారం చెల్లించే పరిస్థితి ఉండేది. రెండు నెలలు కావస్తున్నా ఇంతవరకూ రైతు చేతికి కూటమి ప్రభుత్వం చిల్లిగవ్వ కూడా ఇవ్వలేదు. భారీ వర్షాలు, వరదల వల్ల డివిజన్‌లో వ్యవసాయ, ఉద్యాన పంటలు కలిపి 5,354 హెక్టార్లలో నష్టం వాటిల్లినట్టుగా అధికారులు లెక్కలు తేల్చారు. డివిజన్ వ్యాప్తంగా సుమారు రూ.10 కోట్ల మేర రైతులు పంటనష్టం కింద అందాల్సి ఉంది. మళ్లీ రెండో విడతగా ఈ నెలలో వచ్చిన భారీ వర్షాలకు పంటలు దెబ్బ తిన్నాయి. వీటి నష్టం అంచనాలు ఇంకా తేలలేదు.

సంక్రాంతి నుంచి అభివృద్ధి పనుల ప్రారంభం

- ఎంపీపీ కాకర్ల నారాయుడు
- కొవ్వూరు మండల పరిషత్ సమావేశం



మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కాకర్ల నారాయుడు

కొవ్వూరు: రానున్న సంక్రాంతి నాటికి గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపడతామని ఎంపీపీ కాకర్ల సత్యనారాయణ (నారాయుడు) ప్రకటించారు. కొవ్వూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం ఎంపీపీ నారాయుడు అధ్యక్షతన నిర్వహించారు. ప్రభుత్వం వంద రోజుల పాలనలో పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు జమ కావడం శుభ పరిణామని ఎంపీపీ పేర్కొన్నారు. మండలంలో చేపట్టే పలు అభి వృద్ధి పనులకు సమావేశం ఆమోదం తెలిపింది. ప్రధానంగా వాడపల్లిలో ఎస్సీ కమ్యూనిటీ హాలు నిర్మాణం, మద్దూరులంకలో సీసీ డ్రైన్ నిర్మాణం, దొమ్మేరులో సీసీ డ్రైన్లు, తోగుమ్మి చర్చి పక్కన రోడ్డు నిర్మాణం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్, రైతు భరోసా కేంద్రానికి అదనపు సదుపాయాల కల్పనకు సమావేశం ఆమోదం తెలిపింది. మండల పరషత్ సాధారణ నిధుల నుంచి ఐ.పంగిడి, ధర్మవరం, నందమూరు గ్రామాల్లో క్వారీ రబ్బిష్‌తో 24 పనులు చేపట్టేందుకు రూ.48 లక్షలు చెల్లించేందుకు సమావేశంలో ఆమోదం తెలిపారు. శాఖల వారీ చేపడుతున్న వివిధ పథకాలు, పనితీరు గురించి ఆయా శాఖల అధికారుల వివరించారు. ఎంపీడీవో కె.సుశీల, జెడ్పీటీసీ సభ్యురాలు బొంత వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీలు వీరమళ్ల నారాయుడు, నూతంగి రేఖ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో కార్మికులకు ఆశాభంగం

కొవ్వూరు: రాష్ట్రంలో బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయినప్పటికీ దినసరి, అసంఘటితరంగ కార్మికులకు ఎలాంటి మేలూ జరగలేదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు ఆరోపించారు. రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని, అసంఘటిత రంగ కార్మిక కుటుంబాలన్నింటికీ బీమా సదుపాయం కల్పిస్తామని హామీలను అమలు చేయలేకపోయారని ఆయన విమర్శించారు. శుక్రవారం పట్టణంలో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. చంద్రబాబు ప్రభుత్వవ అధికారంలోకి వచ్చి వంద రోజులైనా ఇంత వరకు సామాన్యులకు ఇసుక అందుబాటులోకి తీసుకు రాలేదని ఆరోపించారు. తద్వారా నిర్మాణరంగ కార్మికుల ఉపాధి ఆగిపోయిందన్నారు. కార్మికులకు చంద్రన్న బీమా పథకాన్ని మళ్లీ పునరుద్ధరించాలన్నారు. మైగాపుల నాగేశ్వరరావు, వల్లేపల్లి నరసింహమూర్తి, మద్దుకూరి దొరయ్య, మైగాపుల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల చెంతకు పారిపోయిన బాలికలు



బాలికలను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు

నిడదవోలు: తల్లిదండ్రులు మందలించారని మనస్తాపం చెందిన ఇద్దరు బాలికలు ఇంట్లోంచి పారిపోయి రైల్లో నిడదవోలు చేరుకున్నారు. స్థానిక రైల్వే పోలీసులు శుక్రవారం వారిని తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాలిలా ఉన్నాయి. అనపర్తికి చెందిన పదేళ్ల వయసున్న రాచూరి మేరీ, మాణిక్యాల గోగులమ్మ అనే ఇద్దరు బాలికలు గురువారం అనపర్తి రైల్వే స్టేషన్ చేరుకుని అక్కడ ప్యాసింజర్ రైలెక్కారు. వారు నిడదవోలు రైల్వే స్టేషన్‌లో ట్రైన్ దిగిపోయారు. స్టేషన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న వారిని ప్రయాణికులు గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. స్థానిక రైల్వే హెడ్ కానిస్టేబుల్ డి.శ్రీనివాసరావు ఆ బాలికలిద్దరినీ రైల్వే పోలీసు స్టేషన్‌కు తీసుకువెళ్లారు. అక్కడ విచారణ జరిపి వారిద్దరూ అనపర్తికి చెందిన వారిగా నిర్ధారించుకున్నారు. వారిద్దరి ఫొటోలను అనపర్తి పోలీసులకు పంపించగా వారు బాలికల తల్లిదండ్రులకు సమాచారం అందించారు. శుక్రవారం సాయంత్రం ఇద్దరి తల్లిదండ్రులు నిడదవోలు వచ్చి తమ కుమార్తెలను గుర్తించారు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ డి.శ్రీనివాసరావు వారిని తల్లిదండ్రులకు అప్పగించారు.

డ్రోన్ సాయంతో పంటపై కషాయాల పిచికారీ



కురుకూరులో డ్రోన్ సహాయంతో పంటపై కషాయాల పిచికారీకి సన్నాహాలు

దేవరపల్లి: రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని ఉత్పత్తి ఖర్చులను తగ్గించుకోవాలని ప్రకృతి వ్యవసాయ డివిజన్ ట్రైనర్ శ్రీనివాస్ సూచించారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా మండలంలోని కురుకూరు గ్రామంలో శుక్రవారం డ్రోన్ సహాయంతో పంటలకు కషాయాల పిచికారీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ డ్రోన్ ద్వారా తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో కషాయాలను పిచికారీ చేయవచ్చన్నారు. ఆరుగురు రైతులకు చెందిన 10 ఎకరాల పొలంపై పంట ఎదుగుదలకు కోడిగుడ్లు, నిమ్మరసం, చేప, బెల్లం ద్రావణాన్ని పిచికారీ చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో రైతులు కొయ్యలమూడి అచ్యుతరావు, నెల్లూరి రవి, బండి వెంకటరాజు, బండి సురేష్, కొయ్యలమూడి గోపి, మద్దిపాటి శ్రీను, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది శ్రీనివాస్, రామలక్ష్మి, దుర్గ, తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లిలో పారిశుధ్య పనులు



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న దేవరపల్లి సర్పంచ్ కడిమి వీరకుమారి

దేవరపల్లి: స్వచ్ఛత హి సేవలో భాగంగా దేవరపల్లి పంచాయతీ ఆధ్వర్యంలో శుక్రవారం పారిశుధ్య పనులు నిర్వహించారు. గ్రామంలో రోడ్ల పక్కనే పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించి ట్రాక్టర్లపై డంపింగ్ యార్డుకు తరలించారు. స్థానిక పేరం చెరువు వద్ద పేరుకు పోయిన చెత్తను తొలగించారు. పనులను సర్పంచ్ కడిమి వీరకుమారి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కుమారి పర్యవేక్షించారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ పాల్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీను, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కడిమి రాజు తదితరులు పాల్గొన్నారు.

తాడిపర్రులో వీధిలైట్ల ఏర్పాటు

ఉండ్రాజవరం: తాడిపర్రు పంచాయతీ ఆధ్వర్యంలో తాడిపర్రు నుంచి వెలగదుర్రు గ్రామం వరకు, అలాగే తాడిపర్రు నుంచి ఉండ్రాజవరం గ్రామం వరకూ విద్యుత్ స్తంభాలకు సిబ్బంది శుక్రవారం వీధి లైట్లు బిగించారు. తాడిపర్రు పంచాయతీ సర్పంచ్ కె.నరేంద్ర మాట్లాడుతూ రాత్రి వేళల్లో ప్రజలు, విద్యార్థులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఈ సమస్య పంచాయతీ దృష్టికి రావడంతో వీధి దీపాలు ఏర్పాటు చేశామని చెప్పారు.

పొగాకు రైతులకు ఎరువుల సిద్ధం



పి.హేమస్మిత, వేలం నిర్వహణాధికారి

దేవరపల్లి: 2024–25 పంట కాలానికి పొగాకు సాగుకు అవసరమైన ఎరువులు సిద్ధంగా ఉన్నాయని దేవరపల్లి పొగాకు వేలం నిర్వహణాధికారి పి. హేమస్మిత తెలిపారు. స్థానిక వేలం కేంద్రం వద్ద శుక్రవారం ఆమె విలేకరులతో ఆమె మాట్లాడారు. అమోనియం సల్ఫేట్ 500 మెట్రిక్ టన్నులు, కాల్షియం నైట్రేట్ (సీఏఎన్) 30 టన్నుల ఎరువులు వేలం కేంద్రం వద్ద సిద్ధంగా ఉన్నాయని వివరించారు. డీఏపీ, ఎస్‌ఓపీ ఎరువులు రావలసి ఉన్నాయని ఆమె తెలిపారు. బ్యారన్‌కు డీఏపీ 4 బస్తాలు, ఎస్‌ఓపీ 11 బస్తాలు, అమ్మోనియం సల్ఫేట్ 10 బస్తాలు, డ్రిప్ వాడే రైతులకు డీఏపీ 3 బస్తాలు, ఎస్‌ఓపీ 14 బస్తాలు (700 కిలోలు), సీఏఎన్ 4 బస్తాలు (100 కిలోలు), అమ్మోనియం సల్ఫేట్ 9 బస్తాల చొప్పున రైతులకు సరఫరా చేస్తున్నట్టు చెప్పారు. డీసీఎంఎస్ ద్వారా రైతు సంఘాల ఆధ్వర్యంలో ఎరువుల సరఫరా జరుగుతుందన్నారు. అవరమైన రైతులు బ్యాంకు ద్వారా డాక్యుమెంటేషన్ చేసి డీసీఎంఎస్‌కు అందజేయాలన్నారు. రైతుల పేరున బ్యాంకు రుణం మంజూరు చేసి ఎరువులకు జమ చేస్తుందన్నారు. వేలం కేంద్రం పరిధిలో 1580 మంది రైతులు, 2891 బ్యారన్లు ఉన్నట్టు హేమస్మిత చెప్పారు.

దాడి చేసిన వారిపై ఫిర్యాదు



పట్టణ సీఐ విశ్వానికి ఫిర్యాదు చేస్తున్న అంబేడ్కర్ హరిజన్ సంక్షేమ సంఘ నాయకులు

కొవ్వూరు: పట్టణంలో గురువారం రాత్రి జరిగిన వినాయకుని ఊరేగింపు చూసేందుకు వెళ్లిన తమ కాలనీకి చెందిన ముగ్గురిని కొందరు కొట్టి గాయపరిచారని స్థానిక శ్రీరామ్ కాలనీకి చెందిన అంబేడ్కర్ హరిజన్ సంక్షేమ సంఘం నాయకులు బొండాడ శ్రీను, ఏనుగుపల్లి రాజు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం రాత్రి వారు పట్టణ సీఐ పి.విశ్వానికి ఫిర్యాదు చేశారు. ఈ దాడిలో తమ కాలనీకి చెందిన బోడపాటి రాహుల్, బోడపాటి దావీదు, మాసా దుర్గమణిలు గాయాల పాలయ్యారన్నారు. అంతేకాకుండా దుండగులు తమ ఇళ్లపై దాడి చేసి, వాహనాలను ధ్వంసం చేసి, విధ్వంసం సృష్టించారని వారా ఫిర్యాదులో పేర్కొన్నారు. మహిళలతో అసభ్యకరంగా మాట్లాడడమే కాకుండా కులం పేరుతో దూషించినట్లు ఫిర్యాదు చేశారు.

ముగింపు దశకు గణనాథుని వేడుకలు



కొవ్వూరు మెరక వీధి వినాయకుని మంటపం వద్ద సామూహిక లక్ష్మీ గణపతి కుంకుమ పూజలు



కొవ్వూరు మెయిన్ రోడ్డులో ఊరేగిస్తున్న వినాయకుని విగ్రహం



దేవరపల్లిలో వినాయకుని ఊరేగింపు

కొవ్వూరు: గణపతి నవరాత్ర మహోత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి. పట్టణంలోని మెరక వీధి వాటర్ ట్యాంక్ వద్ద ప్రతిష్ఠించిన గణనాథుని శిబిరంలో శుక్రవారం సామూహిక లక్ష్మీ గణపతి కుంకుమ పూజలు నిర్వహించారు. పట్టణానికి చెందిన గేదెల భావన ఆర్థిక సహకారంతో భక్తులకు పూజాద్రవ్యాలు అందజేశారు. భారీ సంఖ్యలో మహిళా భక్తులు కుంకుమ పూజల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. రౌండ్ రామాలయం యూత్ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఇక్కడి వినాయక శిబిరం వద్ద సోమవారం భారీ అన్నసమారాధన, అనంతరం స్వామివారి ఊరేగింపు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. పట్టణంలో గురువారం అర్ధరాత్రి వరకూ వినాయక నిమజ్జనాల ఊరేగింపులు సందడిగా జరిగాయి. ఏడో వార్డు, కంతమణి వారి వీధిలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని హంస వాహనంపై ఊరేగించారు. రాజీవ్ కాలనీ, రెండో వార్డు, చిన్న వేంకటేశ్వర స్వామి గుడి వీధిలోని విగ్రహాలతో పాటు పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో విగ్రహాల నిమజ్జనం కోసం కొవ్వూరు తరలివచ్చాయి. కొవ్వూరు ఇసుక ర్యాంపు వద్ద గోదావరి నదిలో విగ్రహాలను నిమజ్జనం చేశారు.

దేవరపల్లి: స్థానిక పీహెచ్‌సీ వద్ద ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహాన్ని శుక్రవారం భక్తులు వైభవంగా ఊరేగించి జలపాతంలో నిమజ్జనం చేశారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై వినాయక విగ్రహాన్ని ఉంచి ఊరేగింపుగా తీసుకువెళ్లి నిమజ్జనం చేశారు.

గోపాలపురం: స్థానిక రాజరాజేశ్వరి టౌన్ షిప్ ఆవరణలో కొత్తగా నిర్మించిన లక్ష్మీగణపతి ఆలయం వద్ద గణపతి నవరాత్రుల సందర్భంగా ప్రతిష్ఠించిన గణనాథుని వద్ద శుక్రవారం లక్ష్మీ గణపతి హోమం నిర్వహించారు. ఆలయ అర్చకుడు గౌతం శర్మ ఈ హోమం జరిగింది. ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకం, అర్చన అభిషేకాలు, లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన జరిగింది.

ఉండ్రాజవరం: మండలంలోని తాడిపర్రు గ్రామంలో కరికాల భక్త సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం వినాయకుని ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై స్వామివారిని గ్రామ వీధుల్లో ఊరేగించారు. కోలాట నృత్యం, వాయిద్యాల సందడిలో ఈ వేడుక జరిగింది. కార్యక్రమంలో కమిటీ నిర్వాహకులు పీతా రఘు, మోటుపల్లి వీరాంజనేయులు, తిరుగు భీమేశ్వరరావు, శ్రీరామారావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు యాదవోలు విద్యార్థినులు



జిల్లా మహిళా క్రికెట్ జట్టుకు ఎంపికైన యాదవోలు జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు

దేవరపల్లి: రాష్ట్రస్థాయి అండర్ –19 మహిళా క్రికెట్ పోటీలకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జట్టు ఎంపిక కోసం మండలంలోని యాదవోలు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థినులు ఎంపికయ్యారని వ్యాయామోపాధ్యాయుడు మునేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఏలూరులో నిర్వహించిన జిల్లా క్రీడాకారిణుల ఎంపిక పోటీల్లో యాదవోలు విద్యార్థినులు ఎంపికైనట్టు వివరించారు. ఏపూరి జ్యోష్ణ, అనిశెట్టి లావణ్య, నెల్లి దేవీప్రియ, తనుబోయిన అనూష, బుసలబోయిన కేశవర్ధిని, మరుకుర్తి సంజన, చుక్క షణ్ముఖప్రియ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు తెలిపారు. అక్టోబరు రెండో వారంలో కృష్ణా జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టుకు వీరంతా ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. ఎంపికైన విద్యార్థినులను ప్రధానోపాధ్యాయుడు పి. శేషగిరిరావు, ఎస్ఎంసీ మాజీ చైర్మన్ షేక్ ముస్తాఫా, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థినులకు యూనిఫాం అందజేత



యూనిఫాం పొందిన విద్యార్థినులతో దాత శ్రీకాకొళపు కాళీకృష్ణ, ఉపాధ్యాయులు

దేవరపల్లి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల్లోని 11 మంది విద్యార్థినులకు ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నాయకుడు, పారిశ్రామికవేత్త శ్రీకాకొళపు కాళీకృష్ణ శుక్రవారం రెండేసి జతల చొప్పున యూనిఫాం అందజేశారు. అలాగే మధ్యాహ్న భోజనం చేయడానికి వీలుగా స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు 100 మందికి కంచాలు, గ్లాసులు అందజేశారు. గత రెండేళ్లుగా ఈ విధంగా అందజేస్తున్నట్టు కాళీకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీలక్ష్మి, టీడీపీ నాయకుడు గన్నమని హరికృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

23, 24 తేదీల్లో స్కూల్ గేమ్స్ పోటీలు

నిడదవోలు: ఈ నెల 23, 24 తేదీల్లో నియోజవర్గస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలను పట్టణంలోని ప్రభుత్వ హైస్కూల్ క్రీడా మైదానంలో నిర్వహిస్తున్నట్టు ఎంఈఓ పి.గురుమూర్తి, నియోజవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ కో–ఆర్డినేటర్ ఎస్. నరసింహులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 23వ తేదీ ఉదయం 10 గంటలకు రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ ఈ పోటీలను ప్రారంభిస్తారని వారు తెలిపారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, యోగా, చెస్, అథ్లెటిక్స్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు.

50 మంది విద్యార్థులకు ఉచితంగా బస్ పాస్‌లు



బస్‌పాస్‌లు పొందిన వేగేశ్వరపురం హైస్కూల్ విద్యార్థులతో అధికారులు

తాళ్లపూడి: దాత సాయంతో వేగేశ్వరపురం కేఎస్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు 50 మందికి ఆర్టీసీ ఉచితంగా బస్ పాస్‌లు అందజేసింది. ఇందుకు స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఏఎస్ఓ జె. వెంకటేశ్వరరావు ఆర్థిక సహాయం చేశారు. కొవ్వూరు డిపో మేనేజర్ కుమార్, సిబ్బంది శుక్రవారం వేగేశ్వరపురం వచ్చి 50 మంది విద్యార్థులకు స్వయంగా బస్ పాస్‌లు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో సీహెచ్ బాలామణి, ఆర్టీసీ సిబ్బంది, ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ చైర్మన్ మేడా సతీష్ తదితరులు పాల్గొన్నారు.

చాగల్లులో వన మహోత్సవం



చాగల్లులో మొక్క నాటుతున్న సర్పంచ్ ఉన్నమట్ల మనశ్శాంతి

చాగల్లు: ఉపాధి హామీ పథకంలో భాగంగా శుక్రవారం చాగల్లు పంచాయతీ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హి సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న చాగల్లు సర్పంచ్ ఉన్నమట్ల మనశ్శాంతి గ్రామంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు ఆళ్ల హరిబాబు, నాదెళ్ల శ్రీరామ్‌చౌదరి కేతా సాహెబ్, కరుటూరి సతీష్, పంచాయతీ కార్యదర్శి ఎల్.రవికుమార్ పాల్గొన్నారు.